క్లుప్తంగా

కోటమ్మతల్లి పండగకు ఘనంగా ఏర్పాట్లు



నాతవరంలో వెలసిన కోటమ్మతల్లి

నాతవరం : కోటమ్మ తల్లి పండగ మహోత్సవం ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. మండల కేంద్రంలో వెలసిన కోటమ్మతల్లిని నాతవరం గ్రామస్తులు పూర్వం నుంచి గ్రామదేవతగా పూజిస్తున్నారు. ఈ అమ్మవారి పండగను మూడేళ్లకోసారి జరుపుకోవడం ఆనవాయితీ. ఈనెల 3వతేదీన పండగ చేసేందుకు వేదపండితులు గ్రామపెద్దలు నిర్ణయించారు. ఇప్పటికే పండగ సందర్భంగా క్రికెట్, షటిల్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. గ్రామమంతా విద్యుత్‌తో అలంకరించారు, అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా భక్తులు రానున్న తరుణంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ పంచాయతీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచే గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మోదకొండమ్మ పండగకు పారిశుధ్య చర్యలు



మాడుగులలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి,ఎంపీపీ రాజారామ్

మాడుగుల: ఈ నెల 3వ తేదీన జరగనున్న మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా డీపీవో శిరీషారాణి, డీఎల్‌పీవో మూర్తి పారిశుధ్యంపై అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పండగ సందర్భంగా గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గ్రామంలో తిరిగి, ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలు, మంచినీటి ఏర్పాట్లతో పాటు పారిశుధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు ఎంపీడీవో అప్పారావు పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీ పరీక్ష

నర్సీపట్నం: పీఆర్‌టీయు ఆధ్వర్యంలో నర్సీపట్నంలో ఆదివారం డీఎస్సీ మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 220 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ మాట్లాడుతూ అభ్యర్థుల్లో భయాన్ని తొలగించేందుకు నమూనా పరీక్ష నిర్వహించామన్నారు. అభ్యర్థుల నుంచి పరీక్షకు మంచి స్పందన లభించిందన్నారు. పరీక్షను పీఆర్‌టీయు నాయకులు అప్పారావు, రమణ, వరహాలనాయుడు పర్యవేక్షించారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ



క్రీడాకారులతో డైరెక్టర్ డాక్టర్ గౌతమి, చైర్మన్ వెలగా నారాయణరావు

నర్సీపట్నం : మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు బాక్సింగ్ గ్లోవ్స్, కరాటే పాడ్స్, వాలీవాల్స్, నేషనల్ క్రీడాకారులకు టీ షర్టులు, నింజాస్ అకాడమి డైరెక్టర్ డాక్టర్ గౌతమి అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, బంగారు నాయుడు, వెలగా జగన్నాథ్, బాబీ మాస్టార్, బాక్సింగ్ ఆర్మీ కోచ్ యోగా సత్యనారాయణ, సీనియర్ కోచ్ శేఖర్, ఉమెన్ కోచ్ ప్రియాంక, శాప్ కోచ్ అబ్బు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమావేశం



మాడుగులలో పూర్వ విద్యార్థుల సందడి

మాడుగుల : ఆర్‌సీఎం పాఠశాలలో 1998-2006 మధ్య చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. నాటి మిత్రులంతా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకరికొకరు సహకారం అందించుకోవాలని, ఏటా కలుసుకోవాలని తీర్మానించుకున్నారు.

నాతవరం : మండల కేంద్రమైన నాతవరం హైస్కూల్లో 1998-99లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువులమ్మ ఒడిలో సరదాగా గడిపారు. తమకు బోధన జరిపిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయికుమార్, కామేశ్వరరావు, రవిశంకర్, కాలేపు రాజు, ప్రభావతి, పైల బాబు పాల్గొన్నారు.



రాచపల్లిలో రేషన్ డిపోవద్ద ఉన్న వృద్ధులు, ఇతర లబ్ధిదారులు



మాకవరపాలెంలో సర్వర్ పనిచేయక వేచిఉన్న లబ్ధిదారులు



గొందుపాలెంలో రేషన్‌షాపు వద్ద వేచి ఉన్న కార్డుదారులు



వంటర్లపాలెం రేషన్ డిపో ద్వారా రేషన్ పంపిణీ

మళ్లీ మొదలైన రేషన్ కష్టాలు



గుమ్మడిగొండలో సర్వర్ పనిచేయక నిరీక్షిస్తున్న మహిళలు

- తొలిరోజే మొరాయించిన రేషన్ మిషన్లు
- పలు డిపోల్లో రేషన్ పంపిణీ నిలిపివేత
- డిపోల వద్ద జనం పడిగాపులు

చోడవరం : కూటమి ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన డీలర్ల వద్దే రేషన్ సరకులు పంపిణీ కార్యక్రమం ప్రారంభం రోజే ప్రజలను అష్టకష్టాలకు గురిచేసింది. ప్రారంభంలోనే వేలిముద్రలు వేసే మిషన్లు సర్వర్ సమస్యతో మొరాయించాయి. రేషన్ కోసం వచ్చిన వినియోగదారులంతా చాలా ఇబ్బందులు పడ్డారు. చోడవరం నియోజకవర్గంలో 194 రేషన్ డిపోల్లోనూ మిషన్లు మొరాయించాయి. చోడవరం మండలంలో 53 రేషన్ డిపోల్లో మధ్యాహ్నం వరకూ మిషన్లు ఏవీ పని చేయలేదు. చోడవరం పట్టణంలో రేవళ్ల, యడ్లవీధి రేషన్ డిపోలను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ప్రారంభించారు. ఈ రెండు డిపోలను మిషన్లు మొరాయించడంతో ప్రారంభించిన కొద్ది సేపటికే డిపోలకు తాళాలు వేసి డీలర్లు వెళ్లిపోయారు. మిగతా చోట్ల గంటకో రెండుగంటలో ఒక కార్డు అవ్వడంతో ఉదయం నుంచి పనులు మానుకొని రేషన్ కోసం డిపోలకు వచ్చిన జనం అంతా నిట్టూరుస్తూ ఇళ్లకు వెనుదిరిగారు.



చోడవరం యడ్లవీధిలో ఎమ్మెల్యే రాజు ప్రారంభించిన రేషన్ డిపో సర్వర్ పనిచేయక మూసేసిన వైనం

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

మాకవరపాలెం : లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ డీలర్లను ఆదేశించారు. మండలంలోని శెట్టిపాలెంలో ఆదివారం రేషన్ సరుకులను పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డిపోల నిర్వహణకు సంబంధించి నిబంధనలు పాటించాలన్నారు. కార్డులదారుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు, శెట్టిపాలెం, బి.బి.పాలెం సర్పంచ్‌లు నాయుడు, నందకిషోర్ పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్‌లు

రేషన్ డిపోల ద్వారా బియ్యం, పంచదార పంపిణీ చేయడంతో ఆదివారం ఉదయం నుంచే లబ్ధిదారులు డిపోల వద్దకు చేరుకున్నారు. అయితే సర్వర్ ఇబ్బందులు తలెత్తడంతో గంటల తరబడి డిపోల వద్దే కార్డుదారులు వేచిఉండాల్సి వచ్చింది. మండల కేంద్రంతోపాటు పలు చోట్ల సర్వర్ ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇక వికలాంగులకు, వృద్ధులకు రేషన్ సరుకులను ఇళ్ల వద్దకే పంపిణీ చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటన చేసినా రాచపల్లి, మాకవరపాలెం, గ్రామాల్లో వృద్ధులు డిపోలకు చేరుకుని సరుకుల కోసం వేచి ఉన్నారు.

కె.కోటపాడు : రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వం తెచ్చిన పాత విధానం మొదటి రోజే కార్డుదారులను ఇబ్బందులకు గురిచేసింది. గొండుపాలెం, ఎ.కోడూరు, వారాడ, వి.సంతపాలెం తదితర గ్రామాల్లో కార్డుదారుల వేలిముద్రలను నమోదు చేసేందుకు సంబంధిత సర్వర్ పని చేయకపోవడంతో గంటల కొద్దీ కార్డుదారులు డిపోల వద్ద వేచి ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం 11 గంటలు అయినా కార్డుదారులకు సరుకులను అందించేందుకు సర్వర్ పని చేయకపోవడంతో కార్డుదారులు నిరాశతో ఖాళీ సంచులతో వెనుదిరిగారు.



చోడవరంలో డిపో వద్ద రేషన్ కోసం నిలబడిన కార్డు హోల్డర్లు

మాడుగుల రూరల్ : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాల ద్వారా చేపట్టిన రేషన్ పంపిణీని రద్దు చేసి, తిరిగి చౌక డిపోల ద్వారా రేషన్ పంపిణీని గ్రామాల్లో ఆదివారం ప్రారంభించారు. రేషన్ డిపోల వద్ద ప్రజాప్రతినిధులు, కూటమి నాయకుల సారథ్యంలో బియ్యం, పంచదార పంపిణీ చేశారు. తొలిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సర్వర్ పని చేయలేదు. దీంతో రేషన్ కోసం లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. మండల కేంద్రంలో తహసీల్దారు రమాదేవి, ఉప తహసీల్దారు లక్ష్మయ్య రేషన్ పంపిణీని ప్రారంభించారు.

నాతవరం : రేషన్ డిపోల వద్ద సరుకుల పంపిణీ కార్యక్రమం తొలిరోజే కార్డుదారులకు కష్టాలు రుచి చూపించింది. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ఇదో కొత్తగా పెట్టిన ప్రభుత్వ పథకం అన్నట్టుగా ఆర్భాటం, హడావిడి చేశారు. అయితే తొలిరోజు లబ్ధిదారులు అంతంతమాత్రంగానే వచ్చారు. దీంతో చేసేది లేక కూటమి నాయకులు తమ కనుసన్నల్లోనే కార్యకర్తలకు సరుకులు పంపిణీ చేసి మమ అనిపించారు. డిపోల్లో చాలా చోట్ల సర్వర్లు పనిచేయకపోవడంతో కార్డుదారులు మళ్లీ మాకు ఈ బాధలేంటి అంటూ అసహనం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో చాలా మందికి సమాచారం లేక సరుగుడు, సుందరకోట డిపోలకు లబ్ధిదారులు రాలేదు.

రేషన్ వాహనాలు తొలగింపు అన్యాయం

బుచ్చెయ్యపేట : గత వైఎస్సార్ ప్రభుత్వంలో ఇంటింటికి తిరిగి నిత్యవసర వస్తువులు అందించే ఎండీయు వాహనాలను కూటమి ప్రభుత్వం తొలగించడం అన్యాయమని జడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. ఆదివారం వడ్డాది రేషన్ డిపోలో బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎండీయు వాహనాలు తప్పించి మరలా రేషన్ డిపోల కష్టాలను తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు మండి పడుతున్నారన్నారు.

రావికమతం: మండలంలో మేడివాడలో రేషన్ డిపోను ఆదివారం చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, సర్పంచ్ వజ్రపు లీల శివ పాల్గొన్నారు.



వడ్డాదిలో రేషన్ డిపోలో సరుకులు అందిస్తున్న జడ్పీటీసీ రాంబాబు

చీడికాడ : ఈ నెల నుంచి నిబంధనల ప్రకారం రేషన్ పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ లింకన్ ఆదివారం ఉదయం చీడికాడ సర్పంచ్ గాలి సామాలమ్మతో కలసి ఆయన రేషన్ పంపిణీని ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఏ డీలరైనా కార్డుదారులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవన్నారు. కాగా పలు గ్రామాల్లో డిపోల వద్ద సర్వర్ సమస్యతో కార్డుదారులు ఇబ్బంది పడ్డారు.



కె.జె.పురం రేషన్ డిపో ద్వారా రేషన్ సరకుల పంపిణీ

వొమ్మలిలో మోదకొండమ్మ పండగ



ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి వెళుతున్న ఆలయ చైర్మన్ వెంకటరమణ తదితరులు



కింతలి వల్లాపురంలో మోదమాంబను దర్శించుకుంటున్న రాంబాబు తదితరులు

మాడుగుల : వొమ్మలి గ్రామంలో మోదకొండమ్మ పండగ అంగరంగ వైభవంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ ఆద్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని అలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు,తప్పెట గుళ్ళు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కె.వల్లాపురంలో...

మాడుగుల రూరల్: కింతలి వల్లాపురలో మోదమాంబ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పూజలు, అభిషేకాలు, ఘటాలుతో మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తాళ్లపురెడ్డి రాంబాబుతో పాటు స్థానికులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం మహిళల కోలాటం, నేలనృత్యాలతో పాటు రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. గత 23 సంవత్సరాల నుంచి అమ్మవారి పండగను ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ రాంబాయి తెలిపారు.

నూతన హెచ్‌ఎంల నియామకం



హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ



ఎ.కోడూరు హెచ్‌ఎం శేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నాతవరం : నాతవరం హైస్కూల్‌కు నూతన హెచ్‌ఎంగా కూండ్రపు సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన హెచ్‌ఎం పదవి విరమణ చేయగా, అప్పటి నుంచి ఇన్‌చార్జితోనే నెట్టుకొచ్చారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో సత్యనారాయణను హెచ్‌ఎంగా నియమించారు. అయనకు హైస్కూల్‌లో పని చేస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం రవిశంకర్, ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు పైల అప్పన్నబాబు, జగన్నాథరావు, విద్యా కమిటీ శుభాకాంక్షలు తెలిపారు.

ఎ.కోడూరు హైస్కూల్ హెచ్‌ఎంగా శేఖర్

కె.కోటపాడు : ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా ఎ.శేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరుగుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా రోలుగుంట మండలం బుచ్చెంపేట హైస్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తున్న శేఖర్ ఎ.కోడూరుకు బదిలీ అయ్యారు. ఆయనను పాఠశాల కమిటీ చైర్మన్ కిల్లి సింహాచలం నాయుడు, ఉపాధ్యాయులు దుశ్శాలువాతో సన్మానించి అభినందనలను తెలిపారు.

20 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసారు..



ఎ.కోడూరు హైస్కూల్లో ఆత్మీయ కలయికకు హాజరైన పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు : వారంతా ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువులు పూర్తి చేశారు. 20 ఏళ్లకు మరలా చదువుకున్న పాఠశాలలోనే ఆత్మీయ కలయికను ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమానికి 90 మంది పూర్వ విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. తోటి స్నేహితుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. స్నేహితులంతా ఐకమత్యంగా ముందుకు సాగుతూ, ప్రతి ఒక్కరి కష్టసుఖాలలో పాలు పంచుకోవాలని వీరు ఆకాంక్షించారు. కార్యక్రమానికి నాటి గురువులైన ఒ.వి.నర్సింహం, అప్పారావు, నాయుడు, సత్యం, అప్పల నాయుడు, బంగారునాయుడు, సన్యాసయ్య, వెంకటరావులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు సూర్రెడ్డి మహేష్, యాండ్రపు మహేష్, యాళ్ళ లోవరాజు, పాటూరి చిన్నంనాయుడు, లెక్కల మధు, సూర్రెడ్డి నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

‘వెన్నుపోటు దినం’ పోస్టర్లు ఆవిష్కరణ

4న చోడవరంలో వైఎస్సార్‌సీపీ నిరసన కార్యక్రమం

చోడవరం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వైస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు పిలుపు ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం కోరుతూ పార్టీ రూపొందించిన వాల్‌పోస్టర్లను చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈనెల 4వ తేదీన వెన్నుపోటు దినంగా ప్రకటిస్తూ చోడవరం నియోజకవర్గంలో సమన్వకర్త మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో చోడవరంలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని సత్యారావు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. ఉదయం 9 గంటలకు అంతా చోడవరం పార్టీ కార్యాలయానికి రావాలని కోరారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, సర్పంచ్‌లు గణపతినాయుడు,చంద్రరావు, పతివాడ అప్పారావు, మాజీ వైస్ ఎంపీపీ గంగరాజు, డీఆర్‌యూసీ సభ్యుడు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆవిష్కరించిన పార్టీ నాయకులు

నాతవరం : ఈ నెల 4వ తేదీన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జిల్లేడుపూడి మాజీ సర్పంచ్ లాలం లోవ అన్నారు. ఆయన జిల్లేడుపూడిలో ఆదివారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. కూటమి నాయకులు బెదిరింపులకు భయపడకుండా ధైర్యంగా ఉండాలని, మీ వెంట వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈనెల 4న నర్సీపట్నంలో మాజీ ఎమ్మె ల్యే గణేష్ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రావికమతం: ఈ నెల 4వ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఆదివారం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు పిలుపునిచ్చారు. ఎంపీపీ పైలరాజు, సర్పంచ్ లోవరాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, ప్రొటోకాల్ జెడ్పీటీసీ ఆదిమూర్తితో కలసి కొత్తకోట గ్రామంలో ఆదివారం పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ పందల దేవ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వడ్డాదిలో జూన్ 4వ తేదీన తలపెట్టిన వెన్నుపోటు దినోత్సవ గోడపత్రికను మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు ఆదివారం ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని ఒక్కటి కూడా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం చోడవరంలో వెన్నుపోటు దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. చోడవరం నియోజకవర్గ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు గుడివాడ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పార్టీశ్రేణులంతా హాజరుకావాలన్నారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్‌లు మాణిక్యం, విజయ్‌కుమార్, మొల్లి శ్రీను, నాయకులు కోవెల ఈశ్వరరావు, కొండబాబు, శంకరరావు వాసు, తెప్పలనాగేష్ పాల్గొన్నారు.



జిల్లేడుపూడిలో ముఖ్య నాయకులతో సమావేశమైన మాజీ సర్పంచ్ లాలం లోవ



వడ్డాదిలో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

యథేచ్ఛగా అనధికార క్వారీలు

- పరిమితి మించి బండరాళ్ల రవాణా
- మారని క్వారీ యజమానుల తీరు
- పట్టించుకోని అధికారులు

రోలుగుంట : అనధికారంగా క్వారీల నిర్వహణ, అనుమతి మెటల్‌కి అయితే రవాణా, విక్రయాలు మాత్రం బండరాళ్లు. ఇదీ రోలుగుంట మండలంలో క్వారీ యజమానుల తీరు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు, మండల అధికారులకు ప్రజాప్రతినిధులకు పలు దఫాలు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమని బుచ్చింపేట, రోలుగుంట, కొవ్వూరు, శరభవరం, రాజన్నపేట తదితర గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. మనదే ప్రభుత్వం..అడిగేవాడెవరు అన్న రీతిలో పరిమితికి మించిన బండరాళ్లు రవాణా చేస్తుండడంతో శరభవరం నుంచి బుచ్చింపేట, శరభవరం నుంచి కొవ్వూరు మీదుగా రోలుగుంట, కొంతలం నుంచి బోగాపురం కూడలి మీదుగా రోలుగుంట రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. అనధికార రవాణా గురించి క్వారీ యజమానులను నిలదీసినా వారు గ్రామస్తులపై ఎదురు దాడికి దిగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులపై అధికారుల కూడా స్పందించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు క్వారీల అనుమతులను పూర్తిస్థాయిలో పరిశీలించి, స్థానికులను విచారించి నిబంధనలను అతిక్రమించిన క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని, దెబ్బతిన్న రోడ్లను పూర్తిస్థాయి బాగు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. లేకుంటే గ్రామాల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



క్వారీల నుంచి రవాణా కోసం సిద్ధం చేసిన బండరాళ్లు

సర్వ రోగాలకు యోగా సంజీవిని



చిన్నారులతో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం : సర్వ రోగాలకు యోగా సంజీవినిలా దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర పేర్కొన్నారు. మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం యోగాపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. చిన్నారులతో కలిసి కమిషనర్ యోగాసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాపై ప్రజల్లో ఆసక్తి పెంచేందుకు తర్ఫీదు ఇస్తున్నామన్నారు.

మోదకొండమ్మ పండగకు గట్టి బందోబస్తు ఏర్పాట్లు

మాడుగుల రూరల్ : మాడుగులలో ఈ నెల 3వ తేదీన జరిగే మోదకొండమ్మ జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు కె. కోటపాడు సీఐ పి.పైడపు నాయుడు ఆదివారం సాయంత్రం పేర్కొన్నారు. ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో జాతర ఏర్పాట్ల గురించి విలేకరులతో మాట్లా డారు. ఈ నెల 3వ తేదీ ఉదయం నుంచి పట్టణంలోకి ఎటువంటి వాహనాలకు అనుమతి లేదని, పోలీసులు కేటాయించిన స్థలంలో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలని అన్నారు. ఘాట్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలను మాడుగుల టీటీడీ కళ్యాణ మండపం వద్ద వున్న స్థలంలోనూ, ఎం.కోడూరు గ్రామం నుంచి వచ్చే వాహనాలు మోదకొండమ్మ గుడి వెనుక వున్న పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేయాలని తెలిపారు. చీడికాడ వైపు నుంచే వచ్చే వాహనాలను తహసీల్దారు కార్యాలయం వెనుకవైపు వున్న పార్కింగ్ స్థలంలో, సాగరం రోడ్డు గుండా వచ్చే వాహనాలు మోదకొండమ్మ కాలనీ వద్ద గల స్థలంలో పార్కింగ్ చేయాలన్నారు. జాతర నిమిత్తం స్టేజ్ వద్ద, ఊరేగింపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జాతరలో జేబుదొంగలను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు వహించాలన్నారు. జాతరకు సుమారు 150 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఉంటుందని, జాతరకు వచ్చే భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ పోలీసువారికి సహకరించి జాతరను జయప్రదం చేయాలని సీఐ పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్‌ఐ జి.నారాయణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.